కవర్ స్టోరీ

# ఓజోన్
## ఆకాశ రక్ష



ఈ విశ్వం అనంతమైనదని మనకు తెలుసు. కోటానుకోట్ల గ్రహాలు అందులో తేలుతూ ఉంటాయనీ తెలుసు. కానీ ఇప్పటివరకూ వాటిలో... ఎక్కడా బుద్ధిజీవులు ఉన్నట్టు శాస్త్రవేత్తలు నిరూపించలేకపోయారు. ఇంత ప్రత్యేకత పుడమికే ఎందుకు ఉంది? అన్న ప్రశ్నకు 'రేర్ ఎర్త్ హైపోథిసిస్' అనే సిద్ధాంతం జవాబు చెబుతుంది. జీవం ఏర్పడటానికీ, తెలివితేటలు సంతరించుకోవడానికీ, మనుగడ కొనసాగించడానికీ... చాలా సంక్లిష్టమైన వాతావరణం కావాలి. ఏదో ఒక్క పరిస్థితి అనుకూలించినంత మాత్రాన ఇది జరగదు. సూర్యుడి నుంచి భూమి ఉండే దూరం, ఆ భూమి వాలుగా తిరగడం, గురుత్వాకర్షణ శక్తి, ఇక్కడి నేల తీరు, నీటి లభ్యత, వాయువుల శాతం... అన్నీ కలిసి అరుదైన జీవులు బతికేందుకు కావాల్సిన వాతావరణాన్ని కల్పిస్తున్నాయి. ఈ పరిస్థితులలో ఓ ముఖ్యమైన వ్యవస్థ- ఓజోన్ పొర. ఈ రక్ష ఛత్రం లేకపోతే... సూర్యుడి నుంచి వచ్చే అతినీలలోహిత కిరణాలు మనను తాకుతాయి. నిలువునా దహించేస్తాయి. భూమి నిలువెల్లా మండిపోతుంది. సున్నితమైన మనుషుల చర్మాల మీద ఆ ప్రభావం మరింత ప్రతికూలం. ఒక్కమాటలో చెప్పాలంటే వెల్డింగ్ మంట కింద నేరుగా నిలబడినట్టే! తల్లి గర్భంలోని మాయపొరలా మనల్ని సంరక్షిస్తున్న ఆ ఓజోన్ పొరకు మన చేజేతులారా చిల్లులు పెట్టేస్తున్నాం. ఇది కచ్చితంగా మానవాళి స్వయంకృతాపరాధమే!

... కె.సహస్ర